## క్లుప్తంగా

### త్రుటిలో తప్పిన ప్రమాదం


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

**చింతపల్లిరూరల్:** పర్యాటకుల కారు అదుపు తప్పి స్తంభాన్ని ఢీ కొట్టిన సంఘటన మండలంలో అన్నవరంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం విశాఖకు చెందిన పర్యాటకులు లంబసింగిని సందర్శించుకొని కారులో అరుకు వైపు వెళ్తుండగా, డ్రైవర్ నిద్రమత్తు కారణంగా వాహనం అదుపు తప్పి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం నేలకూలింది. ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. అన్నవరం ఎస్ఐ రమణ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది సాయంతో నేలకొరిగిన స్తంభాన్ని తొలగించారు.

### సీఐగా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ

**కొయ్యూరు:** కొయ్యూరు సర్కిల్ సీఐగా ఎస్.వెంకటరమణను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ సీఐగా చేస్తున్న ఆర్.ఎస్.కె.బాజీలాల్‌ను ఏలూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. డీటీసీలో పనిచేస్తున్న వెంకటరమణను కొయ్యూరు సీఐగా నియమించారు.

### 24న మండల సమావేశం

**వై.రామవరం:** స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన ఆ రోజు ఉదయం గం. 10.30 లకు ప్రారంభించే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు.

### 22న నగర సంకీర్తన

**అడ్డతీగల:** అయోధ్యలో ఈనెల 22న చేపట్టనున్న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో మండల కేంద్రంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సాయి సేవా సమితి, లలిత సత్సంగ సభ్యులు తెలిపారు. ఆ రోజు ఉదయం 5గంటలకు సీతారాముల విగ్రహాలతో నగర సంకీర్తనతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. స్థానిక కోదండ రామాలయం ప్రాంగణం నుంచి నగర సంకీర్తన ప్రారంభిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొవాలని కోరారు.అదే రోజు సాయంత్రం ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించాలని, వాకిళ్లను అందమైన ముగ్గులతో అలంకరించుకోవాలని సూచించారు.

### ముగిసిన క్రీడా పోటీలు


విజేతగా నిలిచిన చూచిరేవులగూడెం జట్టు

**కూనవరం:** స్థానిక పోలీస్‌స్టేషన్ మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన వాలీబాల్ పోటీలో చూచిరేవుల గూడెం, నర్సింగపేట జట్లు మధ్య పోటీ జరిగింది. ఈ మ్యాచ్‌లో చూచిరేవుల గూడెం జట్టు విజేతగా నిలిచింది. క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం

**జి.మాడుగుల:** మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు, లువ్వాసింగి ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. సమావేశానికి పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు ముఖ్య అతిథులు విచ్చేస్తారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అనుబంధ సంస్థల నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, నామినేటెడ్ పదవుల చైర్మన్లు, డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.



# అన్నదాతకు వెన్నుదన్నుగా ఆర్‌బీకేలు

- స్థానికంగా ప్రభుత్వ సేవలు
- ఆనందంలో గిరిజన రైతులు





రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


చినలబుడలోని రైతు భరోసా కేంద్రం


రైతులకు వ్యవసాయ యంత్రాలను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు(ఫైల్)

**అరకులోయ రూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాలతో గిరి రైతులకు ఎంతో మేలు చేకూరుతోంది. మండలంలో 14 గ్రామ పంచాయతీల పరిధిలో 10 రైతు భరోసా కేంద్రలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో ఆర్‌బీకే భవన నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున మొత్తం రూ.2కోట్ల వ్యయంతో సొంత భవనాలు **కొలువుదీరాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకులు వ్యవసాయ రం**గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. విత్తనాలు, ఎరువులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక వ్యవసాయాన్ని పండుగగా మార్చారు. అన్నదాతకు విత్తు నుంచి పంట కొనుగోలు వరకు అండగా నిలిచారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పంట సాగుకు పెట్టుబడి సాయం.. సీజన్‌కు ముందుగానే విత్తనాలు, ఎరువులను అందజేస్తోంది. దీంతోపాటు రైతుల వద్దకే సేవలందించేందుకు రైతు భరోసా కేంద్రా(ఆర్‌బీకే)లను అందుబాటులోకి తీసుకొచ్చింది. కేంద్రాల్లోని సిబ్బంది క్షేత్రాలకు వచ్చిన రైతులకు సాగు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు. ఆర్‌బీకేల్లో ఉన్న కియోస్క్ యంత్రాల ద్వారు విత్తనాలు, ఎరువుల స్టాకు, బుకింగ్ వంటి సేవలు అందుతున్నాయి. ఈ–క్రాప్ నమోదుతో రైతులకు పరిహారం అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం గిట్టుబాటు ధరలతో పంటలను కొనుగోలు చేసి, దళారీ, సిండికేట్ వ్యవస్థకు **అడ్డుకట్ట వేసింది. కస్టమ్ హైరింగ్** పద్ధతి ద్వారా రైతులకు **వ్యవసాయ యంత్రాలను** ప్రభుత్వం అందజేస్తోంది. ఆర్‌బీకేలు రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ సేవలపై గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**అండగా ఆర్‌బీకేలు**

ప్రభుత్వం అందుబాటులో తీసుకొచ్చిన ఆర్‌బీకేలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం రాజ్మా, రాగులు, వరి, కొర్రలు, వేరుశనగ తదితర పంటల విత్తనాలను పంపిణీ చేస్తోంది. మండల వ్యాప్తంగా 8,690 మంది రైతులున్నారు, మండల వ్యాప్తంగా ఒక్కో అన్నదాతకు రైతు భరోసా ద్వారా రూ.13,500 చొప్పున రూ.11,73,15,000ల సొమ్మును ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాకు జమచేసింది. కస్టమ్ హైరింగ్ ద్వారా రైతులకు ఒక ట్రాక్టర్, 32–పవర్ వీడర్లు, 4–పవర్ టిల్లర్లు, బ్రేస్ కటర్లను అందజేసింది. దేశంలో మరెక్కడ లేని విధంగా రైతులకు జగనన్న ప్రభుత్వం అనేక పథకాలతో ఆదుకుంటోందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

#### ఆర్‌బీకేలతో ఎంతో మేలు



రైతుల కష్టాలు తొలగాయి. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం ఎంతో ఇబ్బంది పడ్డాం. రైతులను ఆదుకునేందుకు జగనన్న ప్రభుత్వం అనేక పథకాలను అమల్లోకి తీసుకొచ్చింది. ఆర్‌బీకేలతో రైతులకు ఎంతో మేలు జరిగింది.

–రామన్న, రైతు, మొర్రిగుడ గ్రామం, బస్కి పంచాయతీ

#### జగనన్నకు రుణపడి ఉంటాం



ఆర్‌బీకేల ద్వారా అన్ని సేవలందుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎరువులు, విత్తనాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బందులు లేవు. రైతుల చెంతకే సేవలందుతున్నాయి. అన్నదాతకు అండగా నిలుస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

–కొర్రా లలిత, రైతు, చినలబుడు గ్రామం

#### అందుబాటులో అన్ని సేవలు

ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న పథకాలన్నీ అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్నారు. పంటల సాగులో సూచనలు, సలహాలు అందిస్తున్నాం.

– ఫణిరాజ్‌వర్మ, వ్యవసాయ శాఖ ఏడీ, అరకులోయ, మండలం

# జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ రక్ష


పద్మాపురంలోని ఏర్పాటుచేసిన శిబిరంలో వైద్యులు ఉదయ్‌ప్రశాంత్, పావని తదితరులు


వైద్య శిబిరానికి వచ్చిన గ్రామస్తులు


ఒట్టిగెడ్డలోని వైద్యశిబిరంలో రోగులకు రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

**అరకులోయ రూరల్:** మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీ సచివాలయం–2 పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో 180 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉదయ్‌ప్రశాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పలువురు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ రక్షగా నిలుస్తోందన్నారు. వైద్యులు పావని, నాయక్, రాజేష్, సిబ్బంది పాపయమ్మ, చిన్న, చిన బాబు తదితరులు పాల్గొన్నారు.

**దుంబ్రిగుడ:** అరకు సంతబయలులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి సందర్శించి, గిరిజనులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచ్ శారద, ఎంపీటీసీ సభ్యురాలు వరహాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

**హుకుంపేట:** సూకూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీడీవో వెంకటరావు ప్రారంభించారు. శిబిరంలో 155 మందికి వైద్య సేవలందించినట్టు డాక్టర్ గాయత్రి చెప్పారు. ఈవోపీఆర్డీ అప్పలరాజు, పీహెచ్‌సీ విస్తరణాధికారి మహేష్, సూపర్‌వైజర్ సాంబశివరావు పాల్గొన్నారు.

**ఎటపాక:** గుండాల గ్రామంలో ఎంపీడీవో గొంగడి వెంకట్రామిరెడ్డి శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. నెల్లిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 135 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సర్పంచ్ సీతాలక్ష్మి, చింతూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, వైద్యులు శ్రీదేవి, విష్ణుప్రియ, సాయి, ఉపసర్పంచ్ శశికుమార్, నర్సింహరావు, వైద్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**రాజవొమ్మంగి:** తంటికొండ పంచాయతీ ఒట్టిగెడ్డ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 152 మందికి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుష్మా, డాక్టర్ నాగార్జున వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యురాలు నిర్మలాదేవి, ఉప సర్పంచ్ వెంకటరమణ, ఎంపీడీవో విజయ రంగారావు, సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, ఎంటీఎస్ సోమరాజు పాల్గొన్నారు.

**గంగవరం :** మొల్లేరు గ్రామ సచివాలయం పరిధిలోని ఆర్.డి.పురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 253 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. పిడతమామిడి, గంగవరం పిహెచ్‌సీ వైద్య సిబ్బంది సేవలందించారు.

**అడ్డతీగల:** డి.భీమవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 349 మంది వైద్య పరీక్షలు చేసినట్టు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. శిబిరంలో ఈవోపీఆర్డీ చినబాబు, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, సోమన్నపాలెం సర్పంచ్ పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


అరకు సంతబయలులో శిబిరాన్ని సందర్శించిన స్వచ్ఛాంధ్ర డైరక్టర్ సోమేశ్వరి,సర్పంచ్ శారద


డి.భీమవరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు


ఎటపాకలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు


సూకురులో రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


ఆర్.డి.పురంలో వైద్య శిబిరానికి వచ్చిన గ్రామస్తులు

# ఈవీఎంలపై అవగాహన


దుంబ్రిగుడలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న బీఎల్‌వోలు


ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ తాతారావు, సిబ్బంది

**దుంబ్రిగుడ:** ఎన్నికల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని సొవ్వ పంచాయతీ దేముడు వలస పోలింగ్ కేంద్రంలో పరిధిలో ఉన్న ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) వినియోగం, ఓటు హక్కుపై బీఎల్‌వోలు రవి, బలరాం, సంజీవ్ తదితరులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**అడ్డతీగల :** స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను శుక్రవారం ప్రదర్శించారు. ఈవీఎం వినియోగంపై రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ తాతారావు అవగాహన కల్పించారు.

# నేడు నవోదయ ప్రవేశ పరీక్ష


కూనవరంలోని పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ బాబూరావు

**వై.రామవరం:** మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపల్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని సూచించారు. ఇక్కడి సెంటర్‌లో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9490876026, 9490957247 నంబర్లకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు.

**కూనవరం:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించనున్న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు చీఫ్ సూపరింటెండెంట్ చిచ్చడి బాబూరావు శుక్రవారం తెలిపారు. నాలుగు విలీన మండలాల నుంచి 196 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు చెప్పారు. పరీక్షలకు తొమ్మిది మంది ఇన్విజిలేటర్లను నియమించినట్టు పేర్కొన్నారు. సెంటర్ లెవెల్ అబ్జర్వర్‌గా సీహెచ్ అప్పారావు వ్యవహరించనున్నట్టు తెలిపారు.

## ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ


అయోధ్య రాముని అక్షింతలు, రామ మందిర చిత్రపటాలను పంపిణీ చేస్తున్న భక్తులు

**చింతపల్లిరూరల్:** అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలను మండల కేంద్రంలోని మైలుకూలి వీధిలో అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా అక్షింతలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలు, అయోధ్యలోని శ్రీరామ మందిర చిత్రపటాలను అందజేశారు. హిందూ ధార్మిక పరిషత్ జిల్లా కన్వీనర్ రమణ, వర్తక సంఘం కార్యదర్శి బేతాళుడు, వార్డు మెంబర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల ప్రణాళికపై అవగాహన


అరకులోయలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు


శిక్షణకు హజరైన ప్రజాప్రతినిధులు, సిబ్బంది


అనంతగిరిలో మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

**అరకులోయ రూరల్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులందరూ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలను గుర్తించి, పరిష్కారానికి నిధుల కేటాయింపుపై తీర్మానం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైస్ ఎంపీపీ రామన్న, ఏవో భాస్కర్ రావు, ఈవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

**అనంతగిరి:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు పంచాయతీలో అభివృద్ధి పనుల ప్రణాళికలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి పాల్గొని మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధిపై ప్రణాళికలను రూపొందించుకుని, ముందుకు సాగాలన్నారు. ఎంపీడీవో శ్రీహర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## గౌరీపరమేశ్వరులకు పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

**అనకాపల్లి :** స్థానిక గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం గౌరీపరమేశ్వరుల 188వ ఊంజల్‌సేవ నేత్రపర్వంగా జరిగింది. మళ్ల కాశీవిశ్వనాథ్ (చిన్నాజీ), భాగ్యమహాలక్ష్మి దంపతులచే అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషసాయి ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, పాలకవర్గ సభ్యులు, గౌరీగీతా మహిళా మండలి, శ్రీసత్తెమ్మతల్లి దేవస్థానం మహిళా మండలి సభ్యులు, గౌరీపరమేశ్వరి, అమృతవర్షిణి, పెతకంశెట్టి సుజాత తదితరులు పాల్గొన్నారు.

## నేడు ద్విచక్ర వాహనాలకు వేలం

**మాడుగుల:** సారాతో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలకు స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌లో ఆదివారం ఉదయం 9.30 గంటలకు వేలం వేయనున్నామని సీఐ సింహాద్రి తెలిపారు. ఆసక్తి గలవారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు.

అధిక మొత్తానికి వేలం పాడినవారు 18 శాతం జీఎస్టీ చెల్లించాలని తెలిపారు.

## రేపు వైద్య శిబిరం

**రంపచోడవరం :** సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ అవరణలో వేమగిరి పరవహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు సంస్థ కార్యదర్శి స్వామి పరిజ్ఞానందజీ మహారాజ్ శుక్రవారం తెలిపారు. శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అపరేషన్లు, కళ్లద్దాలు, మందులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ఆపరేషన్ అవసరమైన వారు ఆధార్, తెల్లరేషన్ కార్డు తీసుకురావాలని సూచించారు.

## గ్రామాల్లో కోలాహలంగా తీర్థాలు


కె.జె.పురంలో సీతారాముల తీర్థానికి తరలివచ్చిన గ్రామస్తులు

**దేవరాపల్లి:** ముషిడిపల్లిలో దుర్గమాంబ తీర్థాన్ని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి గుర్రపు పరుగు ప్రదర్శన రసవత్తరంగా జరిగింది. పోటీల్లో 12 గుర్రాలు పాల్గొన్నాయి. పోటీలను విజయనగరం డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు తదితరులు ప్రారంభించారు. విజేతలకు వరుసగా రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

**రోలుగుంట:** శరభవరం నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాన్ని గురువారం కాపువీధి, శుక్రవారం వెలమవీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వీధుల్లో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**మాడుగుల రూరల్:** కె.జె.పురం మేజర్ గ్రామ పంచాయతీలో సీతారాములోరి తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, చేశారు. గ్రామంలో అతి పెద్ద చుట్టాల తీర్థం సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారి ఆలయం ఎదుట తోడపెద్దు సేవ నిర్వహించారు. కబడ్డీ పోటీలు రసవత్తరంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలతోపాటు సాయంత్రం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

**రెండు గ్రామాల్లో వైభవంగా తీర్థాలు**

**కె.కోటపాడు:** సూర్రెడ్డిపాలెంలో దుర్గాలమ్మ, కె.సంతపాలెంలో నాగదుర్గాలమ్మ తీర్థాల సందర్భంగా ఆయా ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచే పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రెండు గ్రామాల్లో రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.